వ్యక్తి అదృశ్యం


పాక దేవేందర్

అంబర్‌పేట: ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన అంబర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గోల్నాక గోవింద్‌నగర్‌లో నివాసముంటున్న లారీ మెకానిక్ పాక దేవేందర్(56) ఈ నెల 25న ఇంట్లో నుంచి బయటకు వెళ్లి ఎంతకీ తిరిగి రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నేడు ఆత్మీయ సమ్మేళనం

నల్లకుంట: తెలంగాణ బ్రాహ్మణ పరిషత్, తెలంగాణ దేవాలయాల మతైక అర్చక ఉద్యోగుల సంఘం, ధూప దీప నైవేద్య అర్చక సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత గంగు భానుమూర్తి 68వ జయంతి ఆదివారం(నేడు) నిర్వహించనున్నట్లు బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షుడు గంగు కృష్ణచైతన్య ఓ ప్రకటనలో తెలిపారు. న్యూ నల్లకుంట రామాలయం సమీపంలోని శ్రీ రామ కోఆపరేటివ్ సొసైటీ హాల్లో ఉదయం 11.30 గంటలకు ఆత్మీయ సమ్మేళనం ప్రారంభమవుతుందన్నారు. అలాగే ఉదయం 8 గంటలకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు.

నోట్ పుస్తకాల అందజేత


విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేసిన అతిథులు

నల్లకుంట: బీజేపీ ఓబీసీ మోర్చా నాయకుడు యాదగిరి ఆధ్వర్యంలో శనివారం నల్లకుంట డివిజన్ రత్నానగర్‌లోని సంత్ గాడ్గేబాబా స్ఫూర్తి సేవా కేంద్రంలో విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గందమల్ల ఆనంద్ గౌడ్, కార్పొరేటర్ అమృత సంత్ గాడ్గేబాబా చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కిశోర్ కుమార్, మహేష్, శ్రీనివాస్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

చాదర్‌ఘాట్: ఓల్డ్‌మలక్‌పేట డివిజన్‌లో పెండింగ్ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్నను ఎంఐఎం అధ్యక్షుడు షఫియుద్దీన్ కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రైనేజీ, అంతర్గత రోడ్లకు నిధులు విడుదల అయినా పనుల్లో జాప్యం చేస్తున్నారన్నారు. మూసీ పరీవాహక ప్రాంతాల్లో నిత్యం ఫాగింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

సన్మానం


కొండల స్వామిని సన్మానిస్తున్న బ్రాహ్మణ ప్రతినిధులు

నల్లకుంట: యూ ట్యూబ్ ద్వారా విశేష ఆదరణ పొందిన రఘుకుల తిలక రారా.. పాట గాయకుడు పసుపులేటి కొండల స్వామిని పలువురు బ్రాహ్మణ ప్రతినిధులు శనివారం మెట్టుగూడలోని నవచండి సహిత శత రుద్రం సంతాన నాగదేవత ఆలయంలో సన్మానించారు. బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు, బీటీపీడబ్ల్యూఏ ప్రధాన కార్యదర్శి వింజమూరి సుధాకర్ కొండల స్వామిని సన్మానించి అభినందించారు.

డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా చర్యలు

చాదర్‌ఘాట్: మలక్‌పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్‌లో డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామని హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ ఎస్‌జీఎస్ చిలుక నరసింహారెడ్డి పేర్కొన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో శనివారం ఆయన మహబూబ్ మాన్షన్ మార్కెట్‌లో జీహెచ్‌ఎంసీ, హైడ్రా అధికారులు, సిబ్బందితో కలిసి పర్యటించి డ్రైనేజీ మ్యాన్‌హోళ్లను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రైనేజీ మురుగు రోడ్లపై పారకుండా, వర్షపునీరు రోడ్లపై నిల్వకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు ప్రజ్ఞారెడ్డి, మోబిన్, నాగరాజు, మార్కెట్ సిబ్బంది పవన్, శ్రీకాంత్, పెద్ద రవి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

కాచిగూడ: కుటుంబ సభ్యులతో కలిసి రైల్లో ప్రయాణిస్తున్న ఓ బాలిక అదృశ్యమైన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప వివరాల ప్రకారం.. సంజయ్ కుమార్ కుమార్తె కృతిక (19), కుటుంబ సభ్యులతో కలిసి కాచిగూడకు రావడానికి గుంతకల్‌లో ఎలంకి ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కారు. రైలు కాచిగూడ రైల్వే స్టేషన్‌కు వచ్చిన తర్వాత కుటుంబ సభ్యులు అందరూ దిగారు. కాని కృతిక దిగలేదు. తనకు ఇష్టమైన వ్యక్తితో వెళ్తున్నాను.. తన కోసం వెదకవద్దని కుటుంబ సభ్యులకు మెసేజ్ పెట్టి మధ్యలోనే దిగిపోయినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇటు మురుగు.. అటు బురద..


ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని సంధ్య థియేటర్ వద్ద డ్రైనేజీ పొంగడంతో నిలిచిన మురుగు


బురదమయంగా ముషీరాబాద్ పాఠశాల ప్రాంగణం

చిక్కడపల్లి: తరచూ కురుస్తున్న వర్షాలకు రోడ్లపై నిలుస్తున్న నీటితో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వరద నీటితో పాటు డ్రైనేజీలు పొంగి మురుగు ఏరులై పారుతుండంతో ఆయా ప్రాంతాలన్నీ దుర్గంధంగా మారుతున్నాయి. ముషీరాబాద్ నియోజవర్గంలోని ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో రోడ్డుపై మురుగు నిల్వడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇక్కడ నుంచి చిక్కడపల్లి, నారాయణగూడ, అశోక్‌నగర్, సికింద్రాబాద్, ముషీరాబాద్, కోఠి, సచివాలయం, తదతర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. కొన్ని ప్రాంతాల్లో రోడ్లపై ఏర్పడిన గుంతల్లో నీరు నిలిచి వాహనదారులకు కనిపించకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. గాంధీనగర్, అశోక్‌నగర్, చిక్కడపల్లి, రాంనగర్, ముషీరాబాద్, భోలక్‌పూర్, అడిక్‌మెట్, దోమలగూడ, బాగ్‌లింగంపల్లి తదితర ప్రాంతాలలో రోడ్లు అధ్వానంగా మారాయి. సంబంధిత అధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని ఆయా ప్రాంతాల వారు కోరుతున్నారు.


ముషీరాబాద్‌లో వర్షానికి ఇక్కట్లు పడుతున్న వాహనదారులు

వర్షంతో ఇబ్బందులు..

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గంలో శనివారం తెల్లవారు జాము నుంచి కురిసిన వర్షంతో పాఠశాలలు, వివిధ పనుల నిమిత్తం బయటకు వెళ్లేవారు ఇబ్బందులకు గురయ్యారు. పలు ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో వర్షం నీరు నిలిచిపోవడం వల్ల బురదమయంగా మారింది.

పేదలకు మెరుగైన వైద్యం అందించాలి

కాచిగూడ: కార్పొరేట్ ఆసుపత్రులు సామాజిక బాధ్యతలో భాగంగా కొంత మేరకు పేదలకు ఉచిత వైద్య సేవలు అందించాలని బీఆర్‌ఎస్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. శనివారం కాచిగూడలోని ప్రతిమ హాస్పిటల్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. లాభార్జనతో కాకుండా ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించే ఉద్దేశంతో ప్రతిమ ఆసుపత్రి ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రతి రెండవ శనివారం ఆసుపత్రిలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్, వైద్యులు కొండల్ రావు, సుప్రియ, శ్రీదేవి, శ్రీకృష్ణ, దేదీప్య, జగదీష్, శ్రీధర్ పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నేడు భోలక్‌పూర్‌లో బోనాలు

ముషీరాబాద్: భోలక్‌పూర్ డివిజన్‌లోని రంగానగర్‌లో ఆదివారం శ్రావణమాస బోనాలు నిర్వహించనున్నట్లు రంగానగర్ యువజన సేవా సంఘం అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, భూలక్ష్మి, నల్లపోచమ్మ ఆలయ కమిటీ చైర్మన్ వెంకటేష్ తెలిపారు. శనివారం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ..ఆదివారం బోనాలు, తొట్టెల ఊరేగింపు ఉంటుందని తెలిపారు. సోమవారం పోతరాజులు, పలహారబండ్ల ఊరేగింపులు ఉంటాయన్నారు. ఉత్సవాలకు ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు శ్రీనివాస్‌రావు, బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, ఎంపీలు డాక్టర్ కె.లక్ష్మణ్, అనిల్‌కుమార్ యాదవ్, కార్పొరేటర్ గొసుద్దీన్‌తో పాటు వివిధ పార్టీల ముఖ్యనేతలు హాజరవుతారన్నారు. ఈ సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి వినోద్, కోశాధికారి ఎల్లేష్, నాయకులు మల్లేష్, రవికుమార్, ధర్మేందర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

పనుల పూర్తికి ఎమ్మెల్యేకు వినతి

ముషీరాబాద్: పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను సత్వరం పూర్తి చేయాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ సూచించారు. శనివారం ఎమ్మెల్యేను భోలక్‌పూర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, సీనియర్ నాయకుడు మున్వర్ చాంద్ కలిసి భోలక్‌పూర్‌లో నత్తనడకన కొనసాగుతున్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. సిద్దిక్‌నగర్‌లో కచ్చానాలా నిర్మాణ పనులు, శేఖర్ రెడ్డి వీధిలో కొనసాగుతున్న నాలా పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. శేఖర్‌రెడ్డి వీధి భోలక్‌పూర్‌లో ప్రధానమార్గం కావడంతో ప్రజల రాకపోకలు అధికంగా కొనసాగిస్తారని ఈదారిలో పనులు వెంటనే పూర్తి చేయాలని కోరారు. స్థానికులు, వాహనాదారులకు ఇబ్బందులు తలెత్తకుండా వెంటనే పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ముఠా జైసింహ, శంకర్‌గౌడ్, ఆర్.శ్రీనివాస్, శ్రీధర్‌రెడ్డి, ముక్రమ్, ముచ్చకుర్తి ప్రభాకర్ పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

‘ఎస్సీ వర్గీకరణ జీఓతో మాలలకు నష్టం’

సుల్తాన్‌బజార్: ఎస్సీ వర్గీకరణ జీఓ నెంబర్ 99 వల్ల తెలంగాణలో మాల విద్యార్థులకు, ఉద్యోగులకు రోస్టర్ పాయింట్ విధానం వల్ల తీరని అన్యాయం జరుగుతుందని దీనిపై న్యాయం చేయాలని తెలంగాణ మాల సంఘాల జేఏసీ చైర్మన్ డాక్టర్ మందాల భాస్కర్, గ్రేటర్ హైదరాబాద్ మాల సంఘాల జేఏసీ చైర్మన్ బేరా బాలకిషన్ మంత్రి వివేక్ వెంకటస్వామిని కోరారు. శనివారం మంత్రిని కలిసి వినతి పత్రం సమర్పించచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఎస్సీ వర్గీకరణ వల్ల తెలంగాణలోని మాల విద్యార్థులు, ఉద్యోగులకు ఎంతో నష్టం జరుగుతుందన్నారు. ఈ విషయమై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి వివేక్ హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల సంఘాల జేఏసీ చీఫ్ కో ఆర్డినేటర్ తాళ్లపల్లి రవి, వర్కింగ్ చైర్మన్ సిద్దిపేట భీమసేన, ఓయూ విద్యార్థి జేఏసీ అధ్యక్షుడు రాహుల్‌రావు, డాక్టర్ బీవీ స్వామి పాల్గొన్నారు.

డాక్టర్ అఫ్సర్‌కు సినారె సాహితీ పురస్కారం ప్రదానం

సుల్తాన్‌బజార్: కవిత్వమే జీవన సర్వస్వంగా గడిపిన అరుదైన మహాకవి సినారె అని వక్తలు కొనియాడారు. తెలంగాణ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం బొగ్గుల కుంటలోని సారస్వత పరిషత్ దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో సి.నారాయణరెడ్డి జయంత్యుత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అఫ్సర్‌కు సినారె సాహితీ పురస్కారం ప్రదానం చేశారు. ముఖ్యఅతిథులుగా ప్రముఖ సినీ దర్శకులు, నిర్మాత బి.నర్సింగ్‌రావు హాజరై కవి అఫ్సర్‌కు రూ.25 వేల నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో ఘనంగా సత్కరించారు. ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య, డాక్టర్ ఎ.సిల్మానాయక్, సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

‘బీసీ రిజర్వేషన్లు అడ్డుకునేందుకు బీజేపీ యత్నం’


మాట్లాడుతున్న సింహాద్రి యాదవ్

కాచిగూడ: బీసీ రిజర్వేషన్లను అడ్డుకునేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని సమాజ్‌వాది పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ సోమనబోయిన సింహాద్రి యాదవ్ ఆరోపించారు. శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సాహు మహరాజ్ 1902 జూలై 26న బ్రాహ్మణేతరులకు రిజర్వేషన్లు ప్రవేశపెట్టి సామాజిక విప్లవానికి నాంది పలికారని తెలిపారు. జూలై 26న రాజ్యాంగ మాస స్థాపన దినోత్సవం ను సమాజ్‌వాది పార్టీ జరుపుకుందని ఆయన పేర్కొన్నారు. సామాజిక సాధికారితను అందించే రిజర్వేషన్లు బీజేపీ- ఆర్‌ఎస్‌ఎస్‌ల పాలనలో ప్రమాదంలో చిక్కుకున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు పోరాటానికి సిద్ధం కావాలని సమాజ్‌వాది పార్టీ పిలుపునిస్తోందని అన్నారు. బీసీ వ్యతిరేక పాలసీలతో బీజేపీ ముందుకు పోతోందని, బీజేపీ ప్రజా వ్యతిరేక పాలనను ఎండకడుగూ ప్రజలను చైతన్య పరచాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కటికల శ్రీహరి ముదిరాజ్, కోకటి లక్ష్మణ్, మహమ్మద్ రిజ్వాన్ హుస్సేన్, మహమ్మద్ వజీద్‌సిద్దికీ పాల్గొన్నారు.

తైక్వాండో క్రీడలు ఆత్మస్థైర్యానికి దోహదం


క్రీడలను ప్రారంభిస్తున్న మారుతీ వరప్రసాద్ తదితరులు

ముషీరాబాద్: తైక్వాండో క్రీడలు ఆత్మస్థైర్యానికి దోహదపడుతాయని తెలంగాణ త్వైకాండో అసోసియేషన్ కోశాధికారి మారుతీ వరప్రసాద్ పేర్కొన్నారు. శనివారం తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర తైక్వాండో చాంపియన్‌షిప్-2025 సీనియర్, సబ్ జూనియర్ పోటీలను నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన ఆయన విజేతలకు సర్టిఫికెట్లు, మెమొంటోలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ తప్పనిసరి మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని సూచించారు. చిన్నారులను క్రీడల్లో ప్రోత్సహించి ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వాహజ్ అలీఖాన్, వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రం కృష్ణ, నాయకులు మహేశ్వర్, కృష్ణవంశీ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మహోన్నతమైన వ్యక్తి దాశరథి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మహోన్నతమైన వ్యక్తి దాశరథి అని ప్రొఫెసర్ డాక్టర్ దేవేంద్ర అన్నారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అటనమస్ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో దాశరథి శత జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం డాక్టర్ దేవేంద్ర మాట్లాడుతూ.. దాశరథి రచనలోని కవితలు, పాటలు, విద్యార్థులకు వినిపించారు. కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ విష్ణుప్రియ మాట్లాడుతూ..దశరథి వ్యక్తిత్వం జీవిత విషయాలు ప్రస్తుత తరానికి తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మట్టా శేఖర్ ప్రొఫెసర్ యాదగిరి డాక్టర్ విజయేందర్, డాక్టర్ మాధవి, డాక్టర్ అశోక్, కిరణ్‌కుమార్, డాక్టర్ ముదిగొండ భవాని పాల్గొన్నారు.


దాశరథి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టాలి

చిక్కడపల్లి: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో దోమలు వ్యాప్తి చెందకుండా జీహెచ్‌ఎంసీ ఎంటమాలాజీ విభాగం అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్ కోరారు. శనివారం డివిజన్‌లోని అశోక్‌నగర్‌లో ఎంటమాలాజీ సిబ్బంది చేపడుతున్న ఫాగింగ్ పనులను ఆమె పరిశీలించి మాట్లాడారు. నాలా పరీవాహక ప్రాంతాలైన అరుంధతినగర్, సబర్మతినగర్‌లో నిత్యం ఫాగింగ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వినయ్‌కుమార్, ఆనంద్ రావు, జ్ఞానేశ్వర్, ఎంటమాలాజీ సూపర్‌వైజర్‌లు అజయ్, రమేష్, నవీన్ పాల్గొన్నారు.


ఫాగింగ్ మిషన్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్

ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు పెంచాలి

సుల్తాన్‌బజార్: నేషనల్ హెల్త్ మిషన్ స్కీమ్‌లో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు పెంచాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహా డిమాండ్ చేశారు. శనివారం ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కోఠిలోని ఎన్‌హెచ్‌ఎం డైరెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాష్ట్రంలో దాదాపు 1000 మంది నాలుగో తరగతి సిబ్బంది ఈ స్కీమ్ కింద పనిచేస్తున్నారని వీరికి కనీస వేతన చట్టం ప్రకారం జీతాలు అమలు చేయాలని కోరారు. ఆర్‌బీఎస్‌కే డ్రైవర్లకు వెంటనే రావాల్సిన అద్దె బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. తదితర డిమాండ్లపై ఎన్‌హెచ్‌ఎం చీఫ్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ పద్మజకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామరాజేష్ ఖన్నా, బాలయ్య, రమేష్, జగన్, బాలసుబ్రమాణ్యం, జ్యోతి, మహేష్, గణేష్, పద్మ, బాలకృష్ణ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా




హనుమాన్ చాలీసాలో పాల్గొన్న భక్తులు

చిక్కడపల్లి: చిక్కడపల్లి వివేక్‌నగర్‌లోని స్వయంభూగా వెలిసిన ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం హనుమాన్ చాలీసా భక్తబృందం, ధర్మ జాగరణ సమితిల ఆధ్వర్యంలో 108 హనుమాన్ చాలీసా పారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 201 మంది భక్తులు ఉదయం నుంచి రాత్రి వరకు నిర్వహించిన హనుమాన్ చాలీసాలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జానకిసుధాకర్, ఈఓ. దేవనాథం, సభ్యులు శరత్, నిర్మల, శ్రీనివాస్, గణేష్, మురికి గణేష్ పాల్గొన్నారు.

ఉన్నత రికార్డులు సృష్టించడం అభినందనీయం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: విద్యా ప్రపంచంలో బద్రుకా కళాశాల ఉన్నత రికార్డులు సృష్టించడం అభినందనీయమని ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం అన్నారు. శనివారం బాగ్‌లింగంపల్లి ఆర్టీసీ కళాభవన్‌లో బద్రుకా కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ ఆర్ట్స్ 2022–2025 బ్యాచ్ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ఆదర్శ నాయకత్వం, నవీనత, సుస్థిర అభివృద్ధి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, జీవనాంతర విద్యవంటి అంశాలు ‘వికసిత్ భారత్’నిర్మాణానికి కీలకం అని అన్నారు. పట్టభద్రులైన విద్యార్థులకు సామాన్య జ్ఞానం, పౌర సెన్స్, రోడ్ సెన్స్ అభివృద్ధి చేసుకోవాలని, ఇవి ఉత్తమ పౌరసత్వానికి కీలకం అని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.మోహన్ కుమార్, డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ అభిరామకృష్ణ, ప్రొఫెసర్ కె.కృష్ణ చైతన్య, శ్రీలక్ష్మీ నివాస్ శర్మ, శ్రీకిషన్ బద్రుకా, రవి బద్రుకా, రాజేంద్ర బద్రుకా, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.జానకి రామ్, డాక్టర్ పి.వెంకటయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.


విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న ఓయూ వైస్ చాన్సలర్

పొంచి ఉన్న ప్రమాదం

- శిథిలావస్థకు చేరుకున్న మ్యాన్‌హోళ్లు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు


ధూల్‌పేట ప్రాంతంలో ప్రమాదకరంగా ఓపెన్ నాలా

అబిడ్స్: ధూల్‌పేట్ పరిసర ప్రాంతాల్లో మ్యాన్ హోళ్లు, ఓపెన్ నాలాలు శిథిలావస్థకు చేరాయి. వాటిపై కప్పులు లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వినాయక చవితి సమీపిస్తుండడంతో రాష్ట్రంలోని పలు గ్రామాల నుంచి మండప నిర్వాహకులు వినాయక ప్రతిమలను కొనుగోలు చేసి తరలిస్తున్నారు. పురానాపూల్ చౌరస్తా ప్రాంతంలోని మ్యాన్‌హోళ్ల పై కప్పులు విరిగిపోవడంతో పాటు ఓపెన్ నాలా పై కప్పులు లేకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశాలున్నాయి.

అధికారులు చర్యలు తీసుకోవాలి..

పురానాపూల్ ప్రాంతంలో పరిస్థితి మరింత తీవ్రంగా ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ చౌరస్తా మీదుగా వందలాది వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. దీనికి తోడు వినాయక ప్రతిమల తరలింపు జరుగుతుంది. దీనిని దృష్టిలో ఉంచుకొని అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకొని వెంటనే మ్యాన్‌హోళ్ల పై కప్పులు వేయడంతో పాటు ఓపెన్ నాలాలపై కప్పులు వేసేలా చూడాలని స్థానికులు జీహెచ్ఎంసీ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. ప్రతి సంవత్సరం ధూల్‌పేట్ పరిసర ప్రాంతాల్లో చిన్నా, పెద్ద వినాయక ప్రతిమలతో కలిపి దాదాపు లక్ష వినాయక ప్రతిమలను తయారు చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తారు.


శిథిలావస్థకు చేరిన మ్యాన్‌హోల్


పై కప్పు లేని ఓపెన్ నాలా

వెంటనే నాలా పై కప్పలను ఏర్పాటు చేయాలి..



వినాయక చవితిని పురస్కరించుకొని ధూల్‌పేట ప్రాంతంలో తయారవుతున్న వినాయక ప్రతిమల తరలింపు ప్రారంభం అవుతుంది. దీనిని దృష్టిలో ఉంచుకొని మ్యాన్‌హోళ్ల పై కప్పులు ఏర్పాటు చేయడంతో పాటు ఓపెన్ నాలాలపై కప్పులను నిర్మించాలి. భారీ వాహనాల రాకపోకల సందర్భంగా ప్రమాదాలు జరిగేందుకు అవకాశం ఉంది. ఈ విషయంలో ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి. అదే విధంగా ధూల్‌పేట పరిసర ప్రాంతాల్లో రహదారులకు మరమ్మతులు చేపట్టేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.
– సుధీర్ కుమార్ తివారి